# శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాలకు రండి

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, దేవాదాయశాఖ, ఆలయ అధికారులు**



సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

**బేగంపేట జూలై 19, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆషాడ బోనాల ఉత్సవాలకు తప్పకుండా రావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆహ్వానం అందింది. మహాకాళీ ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, వేద పండితులు వేణు మాధవశర్మ, ప్రధాన అర్చకులు రామతీర్థశర్మ, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజారామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కల్సి ఆహ్వాన పత్రికను అందించారు.

ఈ సందర్భంగా శ్రీఉజ్జ యినీ మహాకాళీ ఆషాడ బోనాల ఉత్సవాలకు తప్పక హాజరు కావాలంటూ ఆహ్వానించారు.

# కఠినచట్టాలు చేసినా ఆగని అకృత్యాలు

**♦ మహిళలు, చిన్నపిల్లలపై పెరుగుతున్న వేధింపులు ♦ ఆరునెలల్లో 210 పోక్సో కేసులు నమోదు**



**హైదరాబాద్, జూలై 19,ప్రభాతవార్త:** మహిళలపై విద్యార్థినీలపై రోజురోజుకూ వేధింపులు పెరిగిపోతూన్నాయి. ఈమెయిల్, ఫేస్‌బుక్, వాటా ్సప్‌లతో మహిళలను బెదిరిస్తున్న కేసులు కామన్ అయ్యింది. ఇప్పటివరకు వేధింపులకు గురవుతున్న బాధితుల్లో ఎక్కువశాతం సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్,కాలేజీ విద్యార్థులే ఉన్నారు. అయితే మగవారితో ఉన్న చిన్న చిన్న పరిచయాలతోనే వేధింపులకు గురవుతున్నారని పోలీసుల దర్యాప్తులో తేలుతుంది. దేశంలో ప్రతిమూడు నిమిషాలకు ఒక నేరం జరుగుతూనే ఉంది.ముఖ ్యంగా మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలు పెచ్చుమీరుతున్నాయి. మారిన సామాజిక పరిస్థితులు, స్థితిగతుల మూలంగా ఎక్కువగా అత్యాచారానికి గురయ్యే విధంగా పురిగొల్పుతున్నాయి. తండ్రి స్థాయిలో ప్రేమానురాగాలు పంచాల్సినవారే పైశాచికంగా లైంగిక దాడులకు పాల్పడమనేది ఊహించుకోలేని పరిస్థితి. ఇలాంటి వేధింపులు భరించలేక కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి.

**కన్నకూతురిపై తండ్రి అత్యాచారం...**

కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే మృగంలా మారాడు. అభంశుభం తెలియని చిన్నారిపై సభ్య సమాజం తలదించుకునేలా దారుణానికి ఒడిగట్టాడు. తప్పతాగి 12ఏళ్ల కన్నకూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే ఒడిశాకు చెందిన ఒవ్యక్తి(36) హైదరాబాద్‌కు వచ్చి మేడిపల్లి, సాయినగర్ కాలనీలో ఉంటూ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనిని భార్యవదిలిపెట్టిపోవడంతో తల్లితో ఉంటున్నాడు. కూతురు(12)ను హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నాడు. కాగా కొన్నిరోజుల కిందట కూతురుకు జ్వరంరావడంతో ఇంటికి తీసుకు వచ్చాడు. ఇంట్లో తల్లిలేని సమయంలో అర్ధరాత్రి మద్యం మత్తులో కూతురుపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలికకు జరిగిన విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

**మీర్‌పేట్‌లో మైనర్ బాలికపై అత్యాచారం ..**

ప్రతిరోజు మనచుట్టూ అనేక సంఘటనలు జరుగుతున్న కానీ చాలామంది వాటిని పట్టించుకోకుండా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనేక సంఘటనలు జరుగుతున్నా.. కానీ చాల మంది వాటిని పట్టించుకోకుండా చూసీచూడటన్లుగా వ్యవహరిస్తున్నారు. అనేక చోట్ల మహిళలపై దాడులు జరుగుతున్నా అందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతన్నా కానీ చాలామంది వారింట్లో పిల్లలు, మహిళల భద్రతపై అలసత్వం వహిస్తున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం మీర్‌పేట్‌లో 12 ఏళ్ల బాలికపై 24ఏళ్ల యువకుడు పలుమార్లు అత్యాచారానికి పాల్పడటంతో ఆ అమ్మాయి గర్భం దాల్చిందని ఆరోపణలు వచ్చాయి. బీహార్ నుంచి వలసవచ్చిన అమ్మాయి తల్లిదండ్రులు ఆమె పరిస్థితిని గుర్తించడంతో ఈపరిస్థితి వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై పోక్సో చట్టంకింద కేసు నమోదు చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ఆరునెలల్లో 219 పోక్సో కేసులు...**

ఎన్ని చట్టాలు వచ్చినా బాలికలపై లైంగిక వేధింపులు మాత్రం రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. కఠినశిక్షలు, నిర్భయ చట్టాలు, పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేసినా నేరం చేయడానికి నిందితులు వెనుకాడటం లేదు. ఎందుకంటే వాటి అమలు విషయంలోని లొసుగులే వారికి ధైర్యాన్నిస్తున్నాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. తప్పు చేసిన వారిలో చాలా తక్కువ శాతం మందికే శిక్షపడటంతో నిందితులు బరితెగిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్‌లో గత ఆరునెలల్లో 219 పోక్సో కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు చూస్తే కలవరానికి గురిచేస్తున్నాయి. తండ్రి, బాబాయి,మామ, అన్న,తాత అనే తేడా లేకుండా సొంతవారే కామాంధులుగా మారుతున్నారు. గతేడాదిలో మొత్తం 273 పోక్సో కేసులు నమోదైతే ఏడాది ఆరునెలల్లోనే 219 నమోదు కావడం విస్మయానికి గురిచేస్తుంది.

### ఋతుపవనాలు వచ్చి 40 రోజులవుతున్నా...

# జంట జలాశయాలకు చుక్క నీరు రాలేదు

**ఒక్క భారీ వర్షం వచ్చినా నిండుకుండల్లా మారనున్న జలాశయాలు**

**గండిపేట నుంచి రోజూ 28 ఎంజిడిల నీరు సిటీకి సరఫరా**

**హైదరాబాద్, జూలై 19 ప్రభాతవార్త :** ఈసారి వర్షాకాలంలో ఋతుపవనాలు వచ్చి 40 రోజులవుతున్నా ఆశించిన వర్షాలు కురువడం లేదు. దశాబ్దాల కాలం నుంచి రాజధాని హైదరాబాద్ మహానగర వాసుల దాహార్తిని తీరుస్తున్న జంట జలాశయాలలోకి చుక్క నీరు కూడా కొత్తగా వచ్చి చేరలేదు. ఒక్క భారీ వర్షం కురిసినా జంట జలాశయాలుగా పిలువబడుతున్న గండిపేట, హిమాయత్ సాగర్ జలాశయాలు నిండుకుండల్లా మారే అవకాశాలున్నాయి. కృష్ణా, గోదావరి నదీ జలాలను మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తుండడం వలన ఈ రెండు జలాశయాల నీటి వాడకం చాలావరకు తగ్గిపోయింది. వేసవి కాలంలో నదీ జలాల తరలింపు తగ్గిన సమయంలోనే గండిపేట, హిమాయత్‌సాగర్ జలాలను రాజధాని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతీ రోజు గండిపేట నుంచి 28.ఎంజిడిల నీటిని నగరానికి సరఫరా చేస్తున్నారు. గండిపేట జలాశయం పూర్తి నీటి మట్టం 1790 అడుగులు కాగా ప్రస్తుతం 1779.20 అడుగులు అంటే 1.856 టిఎంసిల నీరుంది. మరో 10.అడుగుల నీరు వస్తే ఈ జలాశయం నిండుకుంటుంది. గత ఏడాది 19 జూలై నాడు 1783.85 అడుగుల నీరు అంటే 2.642 టిఎంసిల నీరుండేది. ఈ సారి కంటే గత ఏడాదే 4.50.అడుగుల నీరు అధికంగా ఉండేది. ఈనెల 10వ తేదీన గండిపేటలో 1779.55 అడుగుల నీరుండేది. అలాగే హిమాయత్ సాగర్ జలాశయం పూర్తి సామర్థ్యం 1763.50 అడుగులు కాగా ప్రస్తుతం 1755.55 అడుగుల నీరుంది.

ఈ జలాశయం మరో 8 అడుగుల కొత్త నీరు వస్తే నిండుకుంటుంది. రంగారెడ్డి జిల్లాలోనే శంకర్‌పల్లి, మోమిన్‌పేట, వికారాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల పరిధుల్లో భారీ వర్షాలు కురిస్తే ఆ వరద నీరంతా వాగుల్లోకి వెళ్లి జంట జలాశయాలలోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం నగరానికి సరఫరా చేస్తున్న తీరుగానే జంట జలాశయాల నుంచి నీటిని సరఫరా చేస్తే ప్రస్తుతమున్న నీరు ఏడాది వరకు సరిపెట్ట వచ్చని జల మండలి అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ధర్మకర్తల మండలి

**చాంద్రాయణగుట్ట, జూలై 19 ప్రభాతవార్త :** లాల్‌దర్వాజ పూల్‌బాగ్ చారిత్రాత్మక శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తలమండలి నూతన కమిటీ శుక్రవారం బాధ్యతలుచేపట్టింది. ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ ట్రస్టీలుగా బి.లెనిన్‌బాబు, అమరేశ్వర్‌రెడ్డి, పి.వెంకటేశ్వర్‌రావు, బి. మధుసూధన్, ఆర్. మురళీధర్, ఎం.మోహన్ రెడ్డి, పి.శైలజ, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా మోహనాచారిలను రాష్ట్ర దేవాదాయ ధర్మదాయశాఖ నియమించింది. ఈ మేరకు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బోయ నగేష్ సమక్షంలో లెనిన్‌బాబును ఆలయ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ట్రస్టీలను దేవాదాయశాఖ అధికారి కె.సురేందర్ కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎన్.శ్రీనివాస్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుర్గేష్ గౌడ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**యూసుఫ్‌గూడ, జూలై 19, ప్రభాతవార్త :** డ్యూటీకి అని వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహ్మత్ నగర్‌లో నివసించే రాము చెఫ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడి భార్య సోదరి కుమార్తె 18ఏళ్ళ యువతి అమీర్‌పేటలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంది. ఈనెల 18న ఉదయం యువతి డ్యూటీకి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. ఆ సమయంలో అతని బావ మరిదికి గుర్తు తెలియని వ్యక్తినుంచి ఫోన్ వచ్చింది. తాను పలాసా జిల్లానుంచి మాట్లాడుతున్నానని షాపింగ్ మాల్‌లో పనిచేసే యువతి బాయ్‌ఫ్రెండ్ అని చెప్పుకొచ్చాడు. తాను ఆ యువతిని పెళ్ళి చేసుకుంటున్నట్లుగా ఫోన్‌లో చెప్పి కట్‌చేసి స్విచ్ఛాఫ్ చేశాడు. దానితో రాము వెంటనే ఈ విషయాన్ని మధురానగర్ పోలీసులకు తెలపడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అనుభవం ఉన్న వైద్యులు చిన్న చిన్న ఆసుపత్రులకు బదిలీ

**బూడిదలో పోసిన పన్నిరులా వారి అనుభవం**

**హైదరాబాద్, జూలై 19 ప్రభాతవార్త :** ప్రభుత్వాలు అనుభవజ్ఞునైన వారి సేవలు వినియోగించుకోడానికి ప్రాధాన్యతనిస్తుంటాయి. నిత్యం ప్రజలకు సేవలందించడంలో నిమజ్ఞమయ్యేవారికి ప్రాధాన్యతనిచ్చి సరైనస్థానంలో కూర్చోబెడతాయి. అనుభవం ఉన్నవారి సేవలు పొందడం ప్రభుత్వ లక్ష్యం. కాని వైద్యశాఖలు అనుభవం పనికిరాకుండా పోయేలా ఉంది. నిత్యం వేల సంఖ్యలో రోగులకు ఎంతో విలువైన సేవలు అందించిన వారికి కేవలం రెండు, మూడు వందలకు మించి రాని ఆసుపత్రులకు బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతో అనుభవం ఉండి, అంకితభావంతో విధులు నిర్వహించేవారి సేవలను మరింతగా ఉపయోగించుకోవాల్సి ఉండగా వారి సేవలను పరిమితానికే ఉపయోగపడేలా చిన్నచిన్న ఆసుపత్రులకు బదిలీ చేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా దాదాపు నాలుగు సంవత్సరాలపాటు అత్భుతమైన సేవలు అందించిన డాక్టర్ రాజారావును యాదాద్రి భువనగిరిలోని కేవలం 150 పడకలు కూడా లేని అతిచిన్న మెడికల్ కాలేజీకి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. గాంధీ ఆసుపత్రిలో నిత్యం రెండు వేలకు మించి రోగులు వైద్యసేవలు పొందుతారు. దాదాపు 35 వివిధ విభాగాలు రోగులకు వివిధ రకాల సేవలు అందిస్తారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రధానమైన ఆసుపత్రి సూపరింటెండ్‌గా విధులు నిర్వహించిన ఆయనను అతి చిన్న కాలేజీకి సూపరింటెండెంట్‌గా నియమించడం చర్చనీయాంశమైంది. కరోనా సమయంలో దాదాపు 75వేల మందికి ప్రాణాలకు తెగించి ఎంతో విలువైన సేవలు అందించి ప్రాణాలను కాపాడారు. అలాగే గాంధీ ఆసుపత్రి అభివృద్ధిలో ఎంతో కీలకంగా వ్యవహరించారు. అప్పటి వైద్యశాఖ మంత్రులతో పలుమార్లు గాంధీ ఆసుపత్రి దుస్థిని వివరించి నిధులు సమకూర్చుకొని అభివృద్ధి సాధించడంలో కీలకంగా వ్యవహరించారు. అలాంటి వైద్యుడిని చిన్న కళాశాలకు బదిలీ చేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అలాగే గాంధీ వైద్య కళాశాల ప్రన్సిపాల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ రమేష్‌రెడ్డిని కూడా భువనగిరిలోని మెడికల్ కాలేజీకి ప్రన్సిపాల్‌గా నియమించారు. ఇలాంటి బదిలీల వల్ల రోగులకు అందాల్సిన ఎంతో విలువైన సేవలను దూరం చేయడమేనని, ప్రభుత్వం మరోసారి ఆలోచించాలని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ఉస్మాయినా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగేందర్ పరిస్థితి కూడా అలాగే ఉంది. తెలంగాణ రాష్ట్రంలోనే కీలకంగా ఉన్న ఆసుపత్రిలో బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఎంతో మెరుగైన వైద్య సేవలు అందించారు. వైద్య సేవల్లో తనకంటు ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారు. దాదాపు 5 సంవత్సరాల పాటు అత్భుతమైన సేవలు అందించారు. ఎంతో అనుభవం ఉన్న ఆయన సేవలు వినియోగించుకోవడం కాకుండా మహేశ్వరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఎంతో అనుభవంతో అత్భుతమైన సేవలు అందిచిన వీరిని గుర్తింపులేని ఆసుపత్రులకు బదిలీ చేసి ప్రాధాన్యతను కోల్పోయేలా చేశారని విమర్శిస్తున్నారు.

**విధి నిర్వహణలో నాలుగేళ్లు...**

విధి నిర్వహణలో నాగుగేళ్లు పూర్తి చేసుకన్న వైద్యులను పెద్ద సంఖ్యలో బదిలీ చేసినప్పటికి కొందరి పట్ల మాత్రం ఉదాసీనంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలు అందరికి ఒకే విధంగా పాటించి ఉంటే సమస్యే ఉండకపోవచ్చు కాని ఎంతో అనుభవం ఉన్నవారిని చిన్న చిన్న ఆసుపత్రులకు బదిలీచేసి కొందరిని మాత్రం దశాబ్దాలు గడుస్తున్న వారిని మాత్రం బదిలీ చేయడం లేదు. దీంతో ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. సికింద్రాబాద్ గాంధీ, ఉస్మానియా ఆసుపత్రిలో దాదాపు 36 మంది నాలుగేళ్లకు పైగా తిష్టవేసుకొని ఉన్నవారే. ప్రత్యేక కోటా కింద వారిని బదిలీచేయకపోవడంపట్ల విమర్శిస్తున్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో ఇద్దరిద్దరు ప్రొఫెసర్‌లు 15నుంచి 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కోటా పేరుతో వారిని బదిలీ చేయకపోవడం చర్చనీయంశంగా మారింది.





# మైక్రోసాఫ్ట్ ఎఫెక్ట్

* ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు టెన్షన్
* సర్వర్‌లో టెక్నికల్ సమస్యలతో
* 35 విమాన సర్వీసులు రద్దు
* సేవలన్నింటా అడ్డంకులే
* కంప్యూటర్లలో బ్లూస్క్రీన్ ఆఫ్ ఎర్రర్ దర్శనం



**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** ఒక్కసారిగా సర్వర్లు డౌన్ అయిన కారణంగా ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ విండోస్ పనిచేయడం ఆగిపోయిన నేపథ్యంలో, నగరంలోని వివిధ సర్వీసులకు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. శుక్రవారం దాదాపు ఆరు గంటల కంటే ఎక్కువ సమయం మైక్రోసాఫ్ట్ సర్వర్లు డౌనయినట్లు తెలుస్తోంది. సాఫ్ట్‌వేర్‌లో ఔటేజ్ సమస్య కారణంగా ఇబ్బందులు తలెత్తినట్లు ఐటీ నిపుణులు గుర్తించారు. ఈ సమస్యను 'బ్లూస్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్' అంటారని, దీని ప్రభావంతో అంతర్జాతీయంగా విమానాశ్రయాలు, ఆరోగ్య సంస్థలు, ఇతర అత్యవసర సేవలు, టెలివిజన్, వార్తా స్టేషన్లు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, మార్కెట్లు, రైల్వే, స్టాక్ ఎక్స్ఛేంజి సేవలు, టెకీ కంపెనీలు, స్వతంత్రంగా పనిచేసే ఫ్రీ లాన్సర్ల వద్ద ల్యాప్‌టాప్‌లు సైతం పనిచేయడం ఆగిపోయాయని ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణులు సోషల్ మీడియా వేదిక ద్వారా వెల్లడించారు. దీంతో ఆయా రంగాలకు చెందిన కోట్లాది ప్రజలు పనుల్లోనూ, లావాదేవీల్లోనూ అంతరాయం ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విడోస్ 10,11 ఓయస్‌లతో పాటు 365 యాప్‌లు, సర్వీసుల్లో సమస్య తలెత్తిందని అధికారులు తెలిపారు.

ముఖ్యంగా విమాన సర్వీసులకు భారీగా అంతరాయం కలగడంతో పెద్దమొత్తంలో డబ్బు నష్టం జరిగింది.ఒక్కసారి విమానం క్యాన్సిలయితే లక్షల్లో నష్టం జరిగుతుందని నిపుణులు చెబుతున్నారు.

అటువంటిది కొన్ని గంటల పాటు సర్వర్లు డౌనవ్వడం వల్ల కలిగే నష్టం మరింత ఎక్కువ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యం లో హైదరాబాద్‌లోని విమానాశ్రయాల్లో ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాశారు. ఎన్నో చోట్ల బ్యాంకింగ్ ట్రాన్సాక్షన్లు ఆగిపోవడంతో ఫ్లైట్లు క్యాన్సిల్ అయ్యాయి.ఎయిర్‌పోర్ట్‌లో డిస్‌ప్లే బోర్డులు కూడా పనిచేయని కారణంగా అధికారులు మాన్యువల్ బోర్డులు ఏర్పాటుచేసి రద్దయిన విమానాల వివరాలు రాశారు. అంతే కాకుండా ప్రయాణికులందరికీ బోర్డింగ్ పాసులను కూడా చేత్తో రాసి ఇస్తున్నట్లు విస్తారా, స్పైస్ జెట్, ఇండిగో తదితర సంస్థలు వెల్లడించాయి. మైక్రోసాఫ్ట్ క్రాష్ అవ్వడాన్ని విశ్లేషిస్తూ సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు వెల్లువెత్తాయి. ఈ సమస్య ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తున్నందువల్ల ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో బ్లూస్క్రీన్ ఆఫ్ డెత్ అనే హ్యాష్ ట్యాగ్ దుమారం రేపుతోంది.

# సంక్షేమ వసతి గృహాలు పరిశుభ్రత పాటించాలి

**మెనుప్రకారం నాణ్యమైన ఆహారం, వసతి సౌకర్యం అందించాలి**

**వివిధ సంక్షేమశాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదేశం**



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** వర్షాకాలంలో వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థులకు డెంగీ, చికెన్ గున్యా, విషజ్వరాలు లాంటి వ్యాధులు ప్రభలకుండా వసతిగృహాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఎస్సీ,ఎస్టీ ,బిసి మైనార్టీ వసతి గృహాల అధికారులు, గురుకులాల ప్రిన్సిపల్స్‌తో నిర్వహించకున్న సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని వసతిగృహాలు, గురుకులాల్లో పరిశుభ్రత, కిచెన్ నిర్వాహణ కుక్ బాధ్యతలు, మెను ప్రకారం ఆహారం, జ్వరం కేసులపై నిఘా ,మేజర్ లేదా మైనర్ రిపేర్లు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇతర మెటీరియల్ పంపిణీ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థుల కెరీర్ నిర్మించడంలో రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్య, మెరుగైన వసతిని అందిస్తుందన్నారు. వసతిగృహాలల్లోని విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం, నీటి నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రతిశుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కిచెన్ నిర్వాహణలో కుక్ యొక్క బాధ్యత, పాత్ర చాలా కీలకమన్నారు. వంటమనిషి స్వీయ పరిశుభ్రత పాటించాలని, వంటచేసేటప్పుడు హెడ్ క్యాప్, చేతి తొడుగులు వాడాలని విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. అలాగే జ్వరపీడితులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా మెడికల్ క్యాంపులను నిర్వహించాలని అన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో మేజర్, మైనర్ మరమ్మత్తులు చేపట్టాలని యూనిఫామ్స్,పుస్తకాలు పంపిణీ చేయాలని, గత సంవత్సరం 10వతరగతి ఫలితాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా కులాంతర వివాహాలు చేసుకున్న ఇద్దరు జంటలకు ఒకొక్కరికి 2.50,000 విలువగల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్స్‌ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ, బిసి ,మైనార్టీ శాఖ అధికారులు పెరిక యాదయ్య, కోటజీ, ఆశన్న, ఇలియాజ్ అహ్మద్, వసతి గృహాల సంక్షేమాధికారులు, గురుకులాల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ కేసుల గుర్తింపు వేగవంతం చేయాలి

**జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి**

**హైదరాబాద్, జూలై 19,ప్రభాతవార్త:** వర్షాల నేపథ్యంలో నగరంలో వ్యాధులు ప్రభలకుండా పారిశుద్ధ్య నిర్వాహణ సజావుగా జరగాలని, దీనిపై ఆయా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు ,సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సూచనలు చేశారు. ఈసందర్భంగా అమ్రపాలి మాట్లాడుతూ వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన పాట్‌హోల్స్‌లను ఎప్పటికప్పుడు పూడ్చివేయాలని తెలిపారు. శానిటేషన్ నిర్వాహణతోపాటు, శానిటేషన్ వర్కర్స్ హాజరు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ కేసులను ఎప్పటికప్పుడు గుర్తించి ,సంబంధిత సమాచారాన్ని సకాలంలో అందించాలని ,అదేవిధంగా డెంగ్యూ కేసులు పెరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. చెరువులు ,నాళాల వద్ద ఎలాంటి భవన నిర్మాణాల వ్యర్థాలు, సాలిడ్ వేస్ట్ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈవిషయంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు.

# అట్టహాసంగా ప్రారంభమైన లాల్‌దర్వాజ బోనాల జాతర



శిఖర పూజా, ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభిస్తున్న సిపి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, సౌత్‌జోన్ డిసిపి స్నేహ మెహ్రా, జిహెచ్‌ఎంసి చార్మినార్ జోన్ కమిషనర్ వెంకన్న

**చాంద్రాయణగుట్ట, జూలై 19 ప్రభాతవార్త,** హైదరాబాద్ పాతబస్తీ ఆషాడమాసంలో వైభవంగా జరుపుకునే చారిత్రాత్మక లాల్‌దర్వాజ శ్రీ సింహవాహిణి మహంకాళి దేవాలయం 116వ వార్షిక బోనాల జాతర ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా శాస్త్రోప్తంగా వేద పండితులు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి గణపతి హోమం, సప్తశతి పారాయణం, ప్రవచనాలు, దేవి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి ఆలయానికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి విచ్చేసి దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా, జిహెచ్‌ఎంసి చార్మినార్ జోన్ కమిషనర్ వెంకన్నతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ యాదవ్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి దప్పుదరువులు, మంగళ వాయిద్యాలతో పూర్ణ కుంభంతో కమిషనర్‌లకు ఘనంగా స్వాగతం పలికారు. కమిషనర్‌లు కె.శ్రీనివాస్‌రెడ్డి, సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా, వెంకన్న ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆలయం పై శిఖర పూజ, ధ్వజారోహణ గావించి 11 రోజుల పాటు జరిగే బోనాల జాతర ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ ప్రతినిధులు కమిషనర్‌లను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎ.మాణిక్ ప్రభుగౌడ్ అమ్మవారికి తొలిబోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్, ఆలయ కమిటీ మాణిక్‌ప్రభు గౌడ్, రాజ్ కుమార్ యాదవ్, షీరా రాజ్ కుమార్, బంగ్లా రాజు యాదవ్, చంద్ర కుమార్, వినోద్ కుమార్, శేషు నారాయణ, గడ్డ రవి తదితరులు పాల్గొన్నారు.

**బోనాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి**

**సిపి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి,**

తెలంగాణలో ఆషాడమాసంలో పాతనగరంలో సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే బోనాలకు లాల్‌దర్వాజ సింహవాహిణి మహంకాళి అమ్మవారికి ఎంతో చరిత్ర ఉందని అన్నారు. ఈ సంవత్సరం తన చేతులమీదుగా బోనాల ఉత్సవాలు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. బోనాల ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్దలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని అన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అన్ని దేవాలయాలవద్ద కావాల్సిన ఏర్పాట్లు చేసిందని అన్నారు. ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు లేకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ నెల 28, 29వ తేదిన జరిగే అమ్మవారి బోనాల పండుగకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు

# డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డిపై వీగిన అవిశ్వాసం

## మేయర్, డిప్యూటీ మేయర్లను గద్దె దింపడంలో విఫలమైన కార్పొరేటర్లు

సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిపై విపక్ష కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన విక్రంరెడ్డిపై అవిశ్వాసం ప్రకటించిన బిజెపి, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆయనను గద్దె దింపడంలో మాత్రం ఘోరంగా విఫలమయ్యారు. మొత్తం 46 మంది కార్పొరేటర్లు గల మీర్‌పేట్ కార్పొరేషన్ లో ఇటీవల బిఆర్ఎస్‌కే చెందిన మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్‌పై అవిశ్వాసం పెట్టి విఫలమైన విపక్ష కార్పొరేటర్లు ఈ సారి అదే పార్టీకి చెందిన డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించి కార్పొరేటర్లు 31 మంది సంతకాలతో కూడిన లేఖను గత నెల 24న జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కార్పొరేటర్ల సంతకాలను ధృవీకరించిన కొన్ని రోజుల తర్వాత అవిశ్వాసానికి సంబంధించి మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వచ్చిన కందుకూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ) సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కమీషనర్ చంద్రశేఖర్ ప్రత్యేక సమావేశం ఏర్పాట్లు చేశారు. అయితే 11 గంటలకు ప్రారంభమైన సమావేశానికి ఏ ఒక్క కార్పొరేటర్ హాజరుకాలేదు. మధ్నాహ్నం 12 గంటల వరకు వేచిచూసిన ఆర్డీఓ మరో అరగంటసేపు పొడిగస్తూ సమయం ఇచ్చారు. అయితే సమావేశానికి కావాల్సిన కోరం సంఖ్య 31 కావాల్సి ఉండగా 26 మంది కార్పొరేటర్లు మాత్రమే సమావేశానికి వచ్చారు. వచ్చిన వారిలో 19 మంది బిజెపి, 7 మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో సమావేశానికి అవసరమైన కోరం లేనందున డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీఓ సూరజ్ కుమార్ ప్రకటించారు. అప్పటికే హాజరైన 21 మంది విపక్ష కార్పొరేటర్లు నిరుత్సాహంగా కార్పొరేషన్ కార్యాలయాన్ని వీడి బయటకు వెళ్ళిపోయారు. దీంతో డిప్యూటీ మేయర్ పదవి విషయమై గత మూడు వారాలకు పైగా కొనసాగిన ఉత్కంఠ వీడిపోయింది.



అవిశ్వాసం వీగిపోవడంతో బయటకు వచ్చిన బిజెపి కార్పొరేటర్లు

**సంతకాలు పెట్టిన వారు మోసం చేశారు: బిజెపి**

డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిని అవిశ్వాసం ద్వారా పదవీచ్యుతుడిని చేయడానికి కలెక్టర్‌కు ఇచ్చిన లేఖలో సంతకాలు పెట్టిన వారే మోసం చేశారని బిజెపి కార్పొరేటర్లు ఆరోపించారు. అవిశ్వాస సమావేశం పెట్టిన సమయంలోనే కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ గార్డెన్స్‌లో కార్పొరేటర్లు సమావేశమయ్యారు. సమన్వయకర్తలుగా రాష్ట్ర బిజెపి నాయకుడు శంకర్‌రెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ యెల్మేటి దేవేందర్‌రెడ్డిలు హాజరైన ఈ సమావేశంలో బిజెపి కార్పొరేటర్లు మాట్లాడుతూ బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ కుమ్ముక్కయ్యారని విమర్శించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లో అభివృద్ధి అంటే కేవలం చెరువుల్లోనే కనిపిస్తున్నదనీ నిధులన్నింటినీ వాటి సుందరీకరణకే మళ్ళిస్తున్నారని వారు ఆరోపించారు. కార్పొరేషన్‌లో అభివృద్ధి అసలు లేదనీ భారీగా పెంచిన పన్నులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ అందుకే బిజెపి అవిశ్వాసం పెట్టిందని తెలిపారు. అయితే కొందరు కార్పొరేటర్లు చెయ్యివ్వడం వల్ల నెగ్గకున్నా ప్రజల పక్షాన ఉంటూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## శాకాంబరిగా శ్రీ విజయదుర్గ మాత



శాకాంబరి అలంకారంలో శ్రీ విజయదుర్గ మాత

సైదాబాద్, జూలై 19 ప్రభాతవార్త: సైదాబాద్ మాతా మైదానంలో కొలువుదీరిన శ్రీవిజయదుర్గ మాత శుక్రవారం శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 28 నుంచి అమ్మవారి బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం శాకాంబరి అలంకరణ గావించారు. అమ్మవారికి విశేష అభిషేకాల అనంతరం దాదాపు 25 రకాల కూరగాయలు, ఆకు కూరలతో కన్నుల పండువగా అలంకరణ గావించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సమస్యలను పరిష్కరించాలని వినతి : మర్రి



ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్, జూలై19, ప్రభాతవార్త: మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు ఎదురు 2ంటున్న సమస్యలను పరిష్కరించేందుకే తాను ఉన్నానని, ప్రజల కోసం ఎంతటి దూరమైన వెళతానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మ ర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నియోజకవర్గ పరిధిలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు, రిజర్వాయర్లను నిర్మించాలని కోరుతూ నియోకజవర్గ పరిధిలోని పలు కార్పొరేటర్లతో కలసి జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు మంచినీరు, భూగర్భ డ్రైనేజీ, రిజర్వాయర్లు లేకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో చర్చించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ కిశోర్ గౌడ్, రాము యాదవ్, డోలి రమేష్, అమీనుద్దీన్, డిల్లీ పరమేష్, శరణగిరి, వెంకటేష్ యాదవ్, సందీప్ రెడ్డి, సతీష్, హనుమాన్ చారి, రమేష్ చారి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్, జూలై 19 ప్రభాతవార్త : ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎఇ కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాంరెడ్డినగర్ పీడర్ పరిధిలోని కెసిఆర్‌నగర్, సాయి కృష్ణకాలనీ, శ్రీరామకాలనీ, వెంకటసాయి కాలనీ, శ్రీనగర్ కాలనీ, బాలకృష్ణ నగర్, అన్నపూర్ణకాలనీ, సాయిబాకాలనీ, కురుమనగర్, లక్ష్మి శ్రీకాంత్‌నగర్, సత్యనగర్, కెటిఆర్‌నగర్, భరత్‌నగర్, శ్రీనగర్ కాలనీ, కామాక్షిపురం, వాసవి నగర్, రాంరెడ్డినగర్ తదితరప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా లక్ష్మినారాయణకాలనీ పీడర్ పరిధిలోని ఐడిఏ ఉప్పల్, టివి కాలనీ, గాంధీనగర్, నేతాజీనగర్, అరవిందనగర్, శ్రీరమణపురం, చర్చి కాలనీ, శ్రీరామకాలనీ, కెటిఆర్‌నగర్, జనప్రియ కాలనీ, డంపింగ్‌యార్డు తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

**రామంతాపూర్‌లో...** రామంతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ రాములు తెలిపారు. రామంతాపూర్ శ్రీనివాసపురం పీడర్ పరిధిలోని శ్రీనివాసపురం, యాదయ్య హోటల్, కామాక్షిపురం, వెంకట్‌రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, విశాల్ పీడర్ పరిధిలోని విశాల్ బిల్డింగ్ ఏరియా, గణేష్‌నగర్, గుప్త గార్డెన్, అరోరా కళాశాల, బ్రహ్మంగారి దేవాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు, గోఖలేనగర్ పీడర్ పరిధిలోని కెన్యా గ్రౌండ్, గోఖలేనగర్, ప్రగతినగర్, ఇందిరానగర్, డీమార్ట్‌కాలనీ, క్రోమా బిల్డింగ్, చర్చి గోడౌన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ రాములు తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని సూచించారు.

## ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న ఆర్టీసి



అవార్డులను అందజేస్తున్న డిపో మేనేజర్ హరి తదితరులు

మలక్‌పేట, జూలై 19 ప్రభాతవార్త: ఆర్టీసి సం స్థ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తుందని దిల్‌సుక్‌నగర్ డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ వెంకన్నల ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రగతి చక్ర పురస్కారంగాను ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్, కండక్టర్లకు మేనేజర్ హరి అవార్డులను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లలిత, జి.ఎన్.రెడ్డి, బుచ్చిరెడ్డి, శృతి, మదన్, ఎంవిఎన్ రావు, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

మలక్‌పేట, జూలై 19 ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత ్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు పపేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత ్వం రైతులకు రుణమాఫీ అమలు చేయడంతో మలక్‌పేట నల్గొండ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు అశ్వాఖ్‌ఖాన్, జి.బాలకృష్ణయాదవ్, బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్ తదితరులు రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రుణమాఫీ చారిత్రాత్మకమైనదని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బద్దం సురేందర్‌రెడ్డి, గంట్ల కృష్ణ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే తమ ధ్యేయం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట, జూలై 19 ప్రభాతవార్త: అభివృద్ధే తమ ధ్యేయమని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని సాయినగర్‌లో రూ. 6.7 లక్షలతో నిర్మించనున్న నూతన రోడ్డు నిర్మాణ పనులను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడడం జరిగిందని, త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని విధలుగా అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం నర్సింహ్మా, సిద్ధు, సంతోష్, ఉదయ్, ఉమేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో అనుమతి లేని షెడ్లు కూల్చివేత



ఉప్పల్ భగాయత్‌లో అనుమతి లేని షెడ్లు కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

ఉప్పల్, జూలై 19 ప్రభాతవార్త : ఉప్పల్ భగాయత్‌లో అనుమతి లేకుండా నిర్మించిన పలు షెడ్లను శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. డిసి అంజనేయులు ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ ఎసిపి వెంకటరమణ, టిపిఎస్ సురేష్, అసిస్టెంట్ రాజు, చైన్‌మెన్ లక్ష్మణ్, విజయ్, రవి తదితరుల ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో అనుమతి లేకుండా వేసిన షెడ్డును పూర్తిగా కూల్చివేశారు. ఈ సందర్భంగా డిసి అంజనేయులు మాట్లాడుతూ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉప్పల్ భగాయత్‌లో కమర్షియల్ నిర్మాణాలకు అనుమతి లేదని, ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపడితే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు ఈటలకు ఆహ్వానం



ఎంపి ఈటలకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న బల్వంతాచారి తదితరులు

ఉప్పల్,జూలై 19 ప్రభాతవార్త : బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌కు బోనాల ఉత్సవ కమిటి నేతలు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు ఉప్పోజి బల్వంతాచారి, దోరేటి అనంద్‌గుప్త, దేవర శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఎంపి ఈటల నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే బోనాల ఉత్సవాలను ప్రజలను ఆనందోత్సవాలతో చేసుకుంటారని, ఉత్సవాలకు భారీ ఎత్తున పాల్గొంటారని తెలిపారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఎఇ

కుషాయిగూడ, జూలై 19 ప్రభాతవార్త : మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా లో శనివారం ఉదయం 10:30 నుండి 12 గంటల వరకు ప్రణామ్ 11 కెవి లీడర్ పరిధిలోని సాకేత్ సబ్స్టేషన్ పరిధిలోని సాకేత్ ఫేస్ 1, ఫేస్ 2 ,ప్రణాం అపార్ట్మెంట్ ,శ్రీయుగ, ప్రాంతాలలో ఈనెల 20 శనివారం విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ విద్యుత్ ఏఈ రామకృష్ణ తెలిపారు. అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ శ్రీవాణి

ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త: కాలనీలో సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఉన్న సమస్యలను కార్పొరేటర్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక కాలనీవాసులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లే విడతల వారిగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## ఇండ్ల పట్టాల పంపిణీ చేయాలి : చింతల

ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త: చాలాకాలంగా పెండింగ్లో ఉన్న ఇండ్ల పట్టాలను వెంటనే పంపిణీ చేయాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. నాగోల్ డివిజన్ సర్వేనెంబర్ 58లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టాల పంపిణీ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్‌యాదవ్, నాయకులు పంగా శ్యామ్ కుమార్, ప్రభాకర్ గౌడ్, నరేందర్‌రెడ్డి, అనితా తదితరులు ఉన్నారు.

## ఆలయాల నిర్మాణ దాత గుబ్బ కృష్ణయ్య మృతి

కుషాయిగూడ, జూలై 19 ప్రభాతవార్త : నిస్వార్థ దానం గుణం కలిగిన మూర్తీభవించిన మానవత ఆధ్వర్యంలో గుబ్బ కృష్ణయ్య మూర్తి తీరని లోటు అని కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయ సంస్థ అధ్యక్షులు కాసం వెంకటహరి గుప్త పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తి ఆశలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈనెల 18 గురువారం రాత్రి మృతి చెందిన సంఘటన తెలియడంతో స్థానికంగా విషాదఛాయలు అమ్ముకున్నాయి. కోట్ల రూపాయల విలువ గల స్థలాన్ని రుణప్రాయంగా ఆలయ నిర్మాణానికి అందజేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా : కెఎల్ఆర్

సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త: సుదీర్ఘకాలం తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన టిపిసిసి ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డితో కలిసి మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బలహీనవర్గాల కాలనీ మురళీకృష్ణానగర్‌లో పర్యటించి అక్కడి పేద మహిళలతో ముచ్చటించారు. ఈ సందర ్భంగా ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆయన ఆరా తీశారు. అనంతరం ప్రధాన రోడ్డు బాలాపూర్ చౌరస్తా సమీపంలో ఆర్టీసి బస్సు ఎక్కి మహిళల ఉచిత బస్సు పథకంపై మహిళలు అభిప్రాయాలు తీసుకున్నారు.

## బాలాపూర్ అంగన్‌వాడిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన మేయర్



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న పారిజాత

సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ అంగన్‌వాడి కేంద్రంలో శుక్రవారం చిన్నారులతో కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. అమ్మ మాట – అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా ఆమె స్థానిక బాలాపూర్ కార్పొరేటర్, కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో కలిసి అంగన్‌వాడికేంద్రాన్ని సందర్శించి అక్షర్యాభ్యాస కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సీనియర్ అంగన్‌వాడి టీచర్లను సన్మానించారు.

## అంగన్‌వాడి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడి చిన్నారులు

సైదాబాద్, జూలై 19 ప్రభాతవార్త: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించాలని శ్రీ సాయినగర్ కేంద్రం ఉపాధ్యాయురాలు సుంచ పద్మిని కోరారు. ఐసిడిఎస్ చేపట్టిన అమ్మ మాట అండన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీ సాయినగర్ అంగన్‌వాడి కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులతో స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడి సిబ్బంది ఇంటింటికి వెళ్లి చదువు యొక్క ఆవశ్యకతను వివరించి మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ చంద్రకళ, సక్కుభాయి తదితరులు పాల్గొన్నారు.

## చోరీలకు పాల్పడిన ఇద్దరు యువకుల అరెస్ట్

ఉప్పల్, జూలై 19 ప్రభాతవార్త : రిటైర్డ్ ఉద్యోగి దృష్టి మళ్లించి ఎటిఎం కార్డు చోరీ చేసి నగదు కాజేసిన ఇద్దరు పాత నేరస్థులను ఉప్పల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైం ఎస్ఐ రఘురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ కల్యాణపురికి చెందిన దరావత్ రాంకోటి (62) గతంలో సెంట్రల్‌కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా పనిచేసి రిటైరయ్యాడు. అయితే గత బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు ఏదో లింక్ పంపించి అతని నుంచి రూ.50ల చొప్పున రెండుస్లార్లు రూ.లక్ష వరకు చోరీ చేశారు. ఈ విషయంపై బ్యాంక్ ఎటిఎంకార్డు తీసుకుని ఉప్పల్ ప్రశాంత్‌నగర్ బ్యాంక్ ఎటిఎం వద్దకు వచ్చాడు. ఎటిఎంలో డబ్బులు చూసుకుంటుండగా అక్కడే మాటువేసిన ముగ్గురు పాత నేరస్థులు అతని దృష్టి మళ్లించి ఎటిఎం కార్డు తీసుకుని పిన్‌నెంబర్ తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో తనకు తెలిసిన వ్యక్తులు ఉన్నారని, అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేద్దామని చెప్పడంతో అతను పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చాడు. ఎటిఎం వద్దనే ఉన్న నేరస్థులు అందులోనుంచి రూ.80వేల డ్రా చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సిసి కెమెరాల ఆధారంగా మల్కాజిగిరికి చెందిన బుల్లెట్ సాయి అలియాస్ సాయికిరణ్ (24), ఉప్పల్ స్వరూప్‌నగర్‌కు చెందిన సాయి లక్కి (23)లను పట్టుకున్నట్లు తెలిపారు. మరో వ్యక్తి పాల్ పరారీలో ఉన్నాడని తెలిపారు. గతంలో వీరు మేడిపల్లి, ఉప్పల్ పిఎస్ పరిధిలో గంజాయి కేసులో జైలుకు వెళ్లివచ్చారని తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మల్లాపూర్ డివిజన్‌లో జడ్‌సి పర్యటన



పార్కును పరిశీలిస్తున్న జోనల్ కమీషనర్ హేమంత్, కార్పోరేటర్ పన్నాల

నాచారం, జుల్లై 19 ప్రభాతవార్త: మల్లాపూర్ డివిజన్ ఓల్డ్ మల్లాపూర్‌లో శుక్రవారం జీహెచ్ఎంసీ ఈస్ట్‌జోన్ కమీషనర్ హేమంత్‌కేశవ్‌పటేల్ కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌తో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓల్డ్ మల్లాపూర్‌లోని వివిధ బస్తీలల్లో సీసీ రోడ్డు, కౌండిన్య భవన్‌లో పెండింగ్ పనులు,మోడరన్ ధోభిఘాట్, సంజయ్ పార్కులో అసంపుర్తిగా ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు పార్కును అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ జోనల్ కమీషనర్ కు కార్పోరేటర్ వినితి పత్రాన్ని అందజేశారు. అందుకు జెడ్‌సీ సానుకూలంగా స్పందించి త్వరితగతిన నిధులను మంజూరు చేస్తానని హామినిచ్చినట్లు కార్పోరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ ముకుందరెడ్డి, ఈఈ హరిలాల్, డిఈ రవీందర్, ఏఈ శ్రవంతితో పాటు స్థానిక నాయకులు పైళ్ల ప్రవీణ్ రెడ్డి, తండా వాసు గౌడ్, ఉస్మాన్ తధితరులు పాల్గొన్నారు.

## రైతును రాజును చేయడమే లక్ష్యం : కెఎల్ఆర్



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త: రైతును రాజును చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కిచన్నగారి లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రబుత్వ అమలు చేసిన అన్నదాతలకు రైతు రుణ మాఫీ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. కిచన్నగారి లక్ష్మిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిలు హాజరై రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పున్న గణేష్, పిట్ట హరినాథ్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, జ్ఞానేశ్వర్‌యాదవ్, కిరణ్, రమేష్ నేత, అక్బర్, లింగస్వామిగౌడ్, దుబ్బాక శేఖర్, రాజు నాయక్, శేఖర్‌ముదిరాజ్, కళ్యాణ్, పెదవూర సైదులు, శ్రీశైలం, శ్రీకాంత్‌రెడ్డి విప్లవ, అంజిరెడ్డి, లక్ష్మీ, రేణుక, మాధవి, సంతోష, రమ, కవిత, జయశ్రీ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ : సబితారెడ్డి



విద్యా ప్రమాణాలపై పిల్లలను అడిగి తెలుసుకుంటున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ ఆర్‌సిఐ రోడ్డులో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ పక్కన ధాతునగర్ చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం మధ్యాహ్నం మాజీ విద్యా శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల తరగతి గదులతో పాటు ఆవరణను, ప్రాంగణాన్ని పరిశీలించి విద్యార్థులను, ఉపాధ్యాయులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యా ప్రమాణాలపై ఆరా తీసి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్కల కామేష్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జెనిగె శ్రీనివాస్ యాదవ్, అబ్బనమోని గోపియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 23న సైదాబాద్‌లో 'మారు బోనాలు'

సైదాబాద్, జూలై 19 ప్రభాతవార్త: ఆషాడ బోనాల సందర్భంగా సైదాబాద్‌లో మారు బోనాలు నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 23వ తేదీ మంగళవారం సైదాబాద్ మెయిన్ రోడ్డుపై ఉన్న హనుమాన్ మఠం నుంచి నాగులమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా మారుబోనాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శివసత్తులు, దప్పు వాయిద్యాలతో ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## లార్డ్స్ శ్రీ విద్యావాణి ఆధ్వర్యంలో బోనాల జాతర

సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త: మీర్‌పేట్ ఆర్ఎన్‌రెడ్డినగర్‌లోని లార్డ్స్ శ్రీ విద్యావాణి పాఠశాలలో శుక్రవారం బోనాల జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల వేషధారణలో బాలురు, బోనం ఎత్తుకున్న బాలికలు ఊరేగింపు కార్యక్రమంలో అలరించారు. బోనాల పండుగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ సొసైటీ రైతులకు రుణమాఫీ: చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణ మాఫీ పథకం కింద భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం పరిధిలోని మొత్తం 99మంది రైతులకు రూ.42.76లక్షల రుణమాఫీ జరిగిందని సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి తెలిపారు. మొత్తం 361 మంది లబ్ధిదారులైన రైతులకు రూ.2.12 కోట్ల రుణ మాఫీ వచ్చిందనీ అయితే ఇందులో 99 మంది రైతులకు రూ.42.76 లక్షలను వారి రుణ ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. మిగతా రైతులకు కూడా వారి రుణ ఖాతాల్లో డబ్బులను జయ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## వీధి కుక్కలను పట్టుకెళ్ళిన వెటర్నరీ సిబ్బంది



వీధి కుక్కలను పట్టుకెళ్తున్న దృశ్యం

ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త: స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలను వెటర్నరీ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేసి పట్టుకున్నారు. పలు కాలనీలలో వీధి కుక్కలవల్ల ఇబ్బందులు జరుగుతున్నాయని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వీధి కుక్కలు వీధుల్లో సైరవిహారం చేస్తూ కాలనీ వాసులను గాయపరుస్తున్నాయని దీంతో ప్రాణాలకు హానికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసుల నుండి పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కుక్కలను పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది సాయి, సంతోష్, రాజు, కాలనీ వాసులు ప్రదీప్ గౌడ్, నరేష్, రూప్లాల్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద అంబర్‌పేటలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

హయత్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త: శాఖాపరమైన మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా ఈనెల 20 శనివారం రోజున పెద్దఅంబర్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కెవి తట్టిఅన్నారం ఎస్ఎస్ నుంచి వెలుబడే 11 కెవి లక్ష్మిగణపతి ఫీడర్ పరిధిలోని జ్యోతిపురం, సూర్యమెడోస్, బ్రిడ్జ్‌వ్యాలీ, హనుమాన్‌నగర్, లక్ష్మీగణపతికాలనీ, రాఘవేంద్రకాలనీ, అన్నవరం సత్యనారాయణకాలనీ, ఆర్ఎన్ఆర్ 1,2, పల్లవి ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలు, జీవీఆర్ కాలనీ కుంట్లూర్, నవోదయ ఎన్‌క్లేవ్‌పరిధిలో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. 33/11కెవి తట్టిఅన్నారం ఎస్ఎస్‌నుంచి వెలుబడే 11కెవి తట్టిఅన్నారంఫీడర్ పరిధిలోని తట్టిఅన్నారం, జీవీఆర్‌కాలనీ, ఆర్.కె.నగర్, మర్రిపల్లి, వనస్థలిహిల్స్, కుత్బుల్లాపూర్, తిమ్మాయిగూడలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతందని ఆయన వివరించారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందితో సహకరించాలని ఆయన కోరారు.